సాక్షి
కర్నూలు

శుక్రవారం । 29 । మార్చి । 2024



మహానేత.. మనసాస్మరామి
నంద్యాలలో సభా వేదికపై మహానేత విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్ . చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు



మా భవిష్యత్తు మీరే...
నంద్యాల సమీపంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసిన క్షణంలో సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు



తీపి జ్ఞాపకం
సీఎం వైఎస్ జగన్‌తో సెల్ఫీ తీసుకుంటున్న యువతి



ప్రభం'జనం': నంద్యాల డిగ్రీకళాశాల మైదానంలో సీఎం బహిరంగ సభకు పోటెత్తిన జనం

మండు వేసవిలో.. అభిమాన జల్లు

జననేతకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

- మండుటెండను సైతం లెక్క చేయక భారీగా తరలివచ్చిన జనం
- దారి పొడవునా.. ఊరూరా ఎగిసిపడిన అభిమాన తరంగం
- పూలు చల్లుతూ.. హారతులు ఇస్తూ సీఎం జగన్‌కు ఘన స్వాగతం
- నంద్యాల బహిరంగ సభ సూపర్ సక్సెస్

అభిమానం ఉప్పొంగింది.. ఆత్మీయత వెల్లివిరిసింది.. మండువేసవిలోనూ దారిపొడవునా సంతోషాల జల్లు కురిసింది.. ఊరూరా పండుగ వాతావరణం కనిపించింది.. మేమంతా సిద్ధం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర గురువారం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. పొలాల్లో పని చేసుకుంటున్న కష్ట జీవులు.. వాహనాల్లో వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ప్రయాణికులు.. విద్యార్థులు.. యువకులు, వృద్ధులు, వ్యాపారులు, వృత్తిపనివారు.. ఇలా ఒకరేమిటి ప్రజలందరూ జననేతకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో కదం తొక్కారు. పార్టీ జెండాలతో ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజలతో మమేకమవుతూ.. ప్రతిపక్షాల కుట్రలను ఎండగడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన జైత్రయాత్రను కొనసాగించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వచ్చిన మార్పులను వివరిస్తూ.. భవిష్యత్తుకు భరోసా ఇస్తూ.. రాష్ట్రంలోని రెండు వందల స్థానాల్లో 'ఫ్యాన్'టాస్టిక్ విజయాన్ని అందించాలని కోరారు. నంద్యాల పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభ జనసంద్రాన్ని తలపించింది.. ప్రతి హృదయంలో 'జగన్'నినాదం ప్రతిధ్వనించింది.



ఫ్యాన్ గుర్తుకే మీ ఓటు..
నంద్యాల సభలో సీఎం వైఎస్ జగన్



నంద్యాల జనసంద్రం

సీఎం బహిరంగ సభ నిర్వహించిన నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానం జనసంద్రాన్ని తలపించింది. ఇసుకేస్తే రాలనంత జనం సభకు తరలివచ్చారు. కనుచూపు మేర ఎటు చూసినా జనాలే కనిపించారు. ప్రజలకు అభివాదం చేస్తూ సుమారు 5 నిమిషాల పాటు సీఎం వైఎస్ జగన్ ర్యాంప్ వాక్ చేశారు. ఎమ్మెల్యేలను, ఎంపీలను ప్రజలకు పరిచయం చేస్తూ, భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభిమానులు, మహిళలు, కార్యకర్తల జోష్ మధ్య బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ సాయంత్రం 5.50 నుంచి 7.15 గంటల వరకు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై నిప్పుల వర్షం కురిపించారు. తోడేళ్లంతా చేరి ఎన్నికలకు వస్తున్నాయని, ప్రజలంతా ఈ విషయాలను గమనించాలన్నారు. చంద్రబాబుకు ఓటేస్తే రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్తుందన్నారు. సీఎం ప్రసంగానికి ప్రజల నుంచి భారీ ఎత్తున స్పందన వచ్చింది. ఈలలు వేస్తూ.. చప్పట్లు కొడుతూ.. సెల్‌ఫోన్ లైట్లు వేసి తమ మద్దతును తెలియజేశారు.

సభ ముగించుకుని ఆటోనగర్ మీదుగా బస్సులో ఆర్‌జీఎం కాలేజీ వద్దకు చేరుకోగానే.. ఇంజినీరింగ్, మెడిసిన్, నర్సింగ్ విద్యార్థులు సీఎం జగన్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు. అక్కడ తన కోసం వేచి ఉన్న శాంతిరాం విద్యాసంస్థల అధినేత, పార్టీ నాయకులు మిద్దె శాంతిరాం, మిద్దె శివరాంలను వైఎస్ జగన్ ఆత్మీయ ఆలింగనం చేసుకుని, వారితో మాట్లాడారు. విద్యార్థులకు అభివాదం చేస్తూ రాత్రి 8.05 గంటలకు పాణ్యం క్రాస్ చేసి వెళ్లారు. సుగాలిమెట్ట, హుస్సేనాపురం, ఓర్వకల్లు మీదుగా రాత్రి 9.15 గంటలకు నన్నూరు టోల్ ప్లాజా దాటారు. పెద్దటేకూరు, కె.మార్కాపురం క్రాస్ మీదుగా పెంచికలపాడు వద్ద ఏర్పాటు చేసిన నైట్ హాల్ట్ శిబిరానికి రాత్రి 11.06 గంటలకు చేరుకున్నారు. కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, పార్టీ నాయకులు స్వాగతం పలికారు.

సీఎం బస్సుయాత్ర సైడ్ లైట్స్...

- ఆళ్లగడ్డ పట్టణ శివారుల్లోని టిడ్కో ఇళ్ల వద్ద వేచి ఉన్న మహిళలు, ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్ ఆగారు. వారందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు కదిలారు.
- బత్తలూరు వద్ద 108 అంబులెన్స్ రావడంతో తన కాన్వాయ్‌ను సైడ్‌కు జరిగి వాహనానికి దారిచ్చారు.
- ఎర్రగుంట్ల వద్ద నూతన దంపతులు కావేరి, వెంకటస్వామిలను ఆశీర్వదించారు. అక్కడే ఉన్న వృద్ధులను బస్సు దిగి పలకరించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.
- భారీ జన సందోహం జగన్ కాన్వాయ్ వెంట రాగా ఉదయం 11 గంటలకు ఎర్రగుంట్ల గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలతో మమేకమయ్యారు. సుమారు రెండు గంటల పాటు అక్కడే గడిపారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలతో ఒక్క ఎర్రగుంట్ల గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలోనే ఈ 58 నెలల కాలంలో రూ.49 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పథకాలు మరింత మెరుగ్గా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.
- 14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తి ఈ పథకాలను ఎందుకు ప్రవేశపెట్టలేదో చెప్పగలడా అని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో పథకాలు సక్రమంగా అందేవా అంటూ ప్రశ్నించగా'' లేదు.. లేదు'' అంటూ ప్రజల నుంచి స్పందన వచ్చింది.
- ఇద్దరు దివ్యాంగ దంపతులు అపర్ణ, ఎస్ ప్రసాద్ మెట్టపల్లె గ్రామం నుంచి ఎర్రగుంట్లకు చేరుకున్నారు. భార్యాభర్తలం ఇద్దరం దివ్యాంగులమని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇద్దరికీ నెలకు రూ.6 వేలు అందుతోందని గర్వంగా చెప్పారు. అనంతరం దివ్యాంగుడు ఎస్.ప్రసాద్ చేతితో గీసిన వైఎస్ జగన్ చిత్రపటాన్ని జననేతకు అందజేశారు. వీరిద్దరూ సరిగ్గా నడవలేరు. వీరికోసం సీఎం వైఎస్ జగన్ మోకాలిపై కూర్చొని వారితో ఫొటో దిగారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సీఎం వైఎస్ జగన్ మరోసారి తన మంచితనాన్ని చాటుకున్నారంటూ 'నెట్టింట' ప్రశంసల వర్షం కురుస్తోంది.
- టైలర్ జ్యోతి, రైతు వీరనాగన్న మరికొంత మంది లబ్ధిదారులు సీఎం జగన్‌తో ఫొటోలు దిగి, తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.
- ఎర్రగుంట్ల సభలో సీఎం వైఎస్ జగన్ నవ్వులు పూయించారు. తాను చిన్న పిల్లాడిని అని అనడంతో సభ మొత్తం చిరునవ్వులమయమైంది. తాను అనుభవంలోగానీ, పాలనలో గానీ కొంత మంది వ్యక్తులతో పోల్చుకుంటే చిన్న పిల్లాడినని వ్యాఖ్యానించారు. ఈ చిన్న పిల్లాడు ఈ 58 నెలల కాలంలో చేసిన పనులు 14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తి ఎందుకు చేయలేకపోయారంటూ ప్రశ్నించారు.
- రైతు నగరం నుంచి నంద్యాల పట్టణంలో సభా ప్రాంగణానికి 3 కి.మీ దూరం ప్రయాణించేందుకు సీఎం జగన్‌కు దాదాపు గంట 10 నిమిషాలు సమయం పట్టింది. కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు.

సీఎం బహిరంగ సభకు అంతా సిద్ధం



ఎమ్మిగనూరులో ముస్తాబైన సీఎం సభా వేదిక

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభకు ఎమ్మిగనూరు పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానం సిద్ధమైంది. గురువారం సాయంత్రానికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం ప్రసంగించేందుకు సభా వేదిక, ప్రజలకు అభివాదం చేసేందుకు ర్యాంప్ నిర్మించారు. ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. విద్యుత్ లైట్ల ఏర్పాట్లు, బ్యారికేడ్ల ఏర్పాటు ప్రక్రియలు పూర్తయ్యాయి. లక్షమందికి పైగా సభలో కూర్చొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు పర్యవేక్షించారు.

సాక్షి, నంద్యాల: ఎన్నికల ప్రచారంలో భాగంగా శంఖారావం పూరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నంద్యాల జిల్లా ప్రజలు భారీ ఎత్తున స్వాగతం పలికారు. మేమంతా సిద్ధం బస్సుయాత్ర గురువారం ఉదయం 9.30 గంటలకు ఆళ్లగడ్డలోని నైట్ హాల్ట్ శిబిరం నుంచి ప్రారంభమైంది. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరులశాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి ఇతర నాయకులతో కలసి ముఖ్యమంత్రి బస్సులో బయలు దేరారు. తన కోసం వేచి ఉన్న వారికి అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. బస్సు యాత్రలో యువత ప్రధాన ఆకర్షణగా నిలిచారు. పార్టీ జెండాలు చేత పట్టుకుని బైక్‌లతో భారీ ర్యాలీలు నిర్వహించారు. అధినేత వెంటే తామంటూ దారిపొడవునా కాన్వాయ్‌ను అనుసరించారు. ఉదయం నుంచే జిల్లాలో ఎండ ప్రభావం తీవ్రంగా ఉంది. పది గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపెట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా పెద్ద ఎత్తున యువకులు, కార్యకర్తలు, నాయకులు జగన్ వెంటే ముందుకు కదిలారు.

దారిపొడవునా ఘన స్వాగతం

ఆళ్లగడ్డ నుంచి నంద్యాల సభకు చేరుకునే వరకు సీఎం జగన్‌కు దారి పొడవునా మహిళలు మంగళహారతులు పట్టారు. పూలతో స్వాగతం పలికారు. తమ అభిమాన నేతకు దిష్టి తగలకుండా బూడిద గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. నల్లగట్ల, బత్తలూరు.. ఇలా ప్రతీ గ్రామంలో మహిళలు మంగళ హారతులతో జననేతకు స్వాగతం పలికారు. ఎర్రగుంట్ల గ్రామం వద్ద ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎర్రగుంట్ల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వెంకటాపురం గ్రామానికి చేరుకున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా తన కోసం వేచి ఉన్న మహిళలను, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా జననేతకు పూలు, హారతులతో మహిళలు స్వాగతం పలికారు. ఒక్క వెంకటాపురం గ్రామంలోనే ఐదు సార్లు ఆయన బస్సు నుంచి కిందకు దిగి ప్రజలను పలకరించారు. శిరివెళ్ల మెట్ట, గోవిందపల్లె మీదుగా దీబగుంట్ల గ్రామానికి మధ్యాహ్నం 2 గంటలకు చేరుకున్నారు. దీబగుంట్ల వద్ద నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్క్ ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులతో పాటు భారీగా తరలివచ్చిన ప్రజలు ఘన స్వాగతం పలికారు. సాంబవరం మెట్ట మీదుగా చాబోలు గ్రామానికి 2.30 గంటలకు చేరుకుని అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. విశ్రాంతి అనంతరం సాయంత్రం 4.30 గంటలకు రైతు నగరం, నూనెపల్లె, బొమ్మలసత్రం ఫ్లైఓవర్ మీదుగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు చేరుకున్నారు.



యువోత్సాహం: మేమంతా సిద్ధం జెండాలతో బైక్‌పై యువకుల ప్రదర్శన

పాల్గొన్న ప్రముఖులు

బహిరంగ సభకు మంత్రులు పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, ఇసాక్‌బాషా, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, గంగుల బిజేంద్రరెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డా.సుధీర్, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ సలహాదారు హబీబుల్లా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, సూర్యనారాయణ రెడ్డి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వంగల భరత్‌కుమార్ రెడ్డి, పీపీ నాగిరెడ్డి, మల్కిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వాసిరెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి బస్సు యాత్ర షెడ్యూల్

కర్నూలు కల్చరల్: మేమంతా సిద్ధం పేరుతో నిర్వహిస్తున్న బస్సుయాత్రలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

- శుక్రవారం ఉదయం 9.30 గంటలకు బస చేసిన పెంచికలపాడు నుంచి కోడుమూరు, పుట్టపాసం, గోనెగండ్ల మీదుగా రాళ్లదొడ్డికి చేరుకుంటారు.
- ఉదయం 11.30 గంటలకు రాళ్లదొడ్డి నుంచి బయలు దేరి సాయంత్రం 4 గంటలకు ఎమ్మిగనూరు చేరుకుంటారు.
- సాయంత్రం 4.30 గంటలకు ఎమ్మిగనూరులో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- సాయంత్రం 5.30 గంటలకు అక్కడి నుంచి బయలు దేరి బోడబండ, ఆరేకల్, బసవ జంక్షన్, చిగిలి, ఆస్పరి మీదుగా రాత్రి 7.30 గంటలకు రాతన చేరుకొంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు.

మా దేవుడు నువ్వేనయ్యా..



సీఎం జగన్‌కు చేతులెత్తి నమస్కరిస్తున్న అభిమాని

ఓ దేఖో మామూ..



నల్లగట్ల గ్రామం వద్ద కుమార్తెకు జననేతను చూపిస్తున్న తండ్రి

అన్నా.. మా నమ్మకం నువ్వే



పోస్టర్లతో ఆత్మీయ నేతకు స్వాగతం పలుకుతున్న మహిళా కూలీలు



కర్నూలు శివారులో రాత్రి 10.30 గంటలకు సీఎం జగన్‌ను చూసిన క్షణంలో స్థానికుల ఆనందోత్సాహం



భారీగా తరలివచ్చిన జన సందోహానికి అభివాదం చేస్తూ సభా వేదికకు చేరుకుంటున్న సీఎం జగన్



ఉత్సాహం ఉరకలు..
అదిగదిగో మా నాయకుడు..

యుద్ధానికి సిద్ధంకండి.. నంద్యాల సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, డాక్టర్ దారా సుధీర్, కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా, నాయకులు శిల్పా మోహన్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

జైత్రయాత్రలో జనహోరు


అల్లా చల్లగా చూడాలని... ఎర్రగుంట్ల సదస్సులో జగనన్నకు రక్షా కడుతున్న ముస్లిం సోదరుడు


జనసంద్రం.. నంద్యాల సభకు తరలివచ్చిన జనం


ఆనంద క్షణం.. జగనన్నను ఫొటో తీస్తూ..



అన్నకు ప్రేమతో.. ఎర్రగుంట్ల సదస్సులో సీఎం జగనన్నకు చెల్లెమ్మ చిరు కానుక..


గెలిపించండి.. నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పోచాను ప్రకటిస్తున్న జగన్

సంక్షేమ సారథికి ఊరూవాడా స్వాగతం పలికింది. పల్లె జనం కదలివచ్చి బ్రహ్మరథం పట్టారు. గురువారం ఆళ్లగడ్డ నుంచి ప్రారంభమైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రకు అడుగడుగునా అభిమానులు పూల వర్షం కురిపించారు. జగనన్నే మళ్లీ సీఎం అంటూ హోరెత్తారు. మేమంతా సిద్ధం అంటూ నంద్యాల సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు.


మామయ్యను చూడు..


అన్నయ్యతో జ్ఞాపకం.. సీఎంతో సెల్ఫీ


మీ వెంటే మా ప్రయాణం.. బత్తలూరు సమీపంలో బస్సులో ప్రయాణికులు


ఈద్ ముబారక్.. జగనన్నతో ముస్లిం కుటుంబం


అపురూప కానుక.. ఎర్రగుంట్ల సదస్సులో సీఎం చిత్ర పటాన్ని ప్రదర్శిస్తున్న అభిమానులు


మీ వెంటే మేము.. బత్తలూరు సమీపంలో జగనన్నను ఆప్యాయంగా పలకరిస్తున్న అక్కాచెల్లెమ్మలు


సంతోషాలు 'విరి'జిల్లేలా.. పేరాయిపల్లె మిట్ట సమీపంలో పూల వర్షం కురిపించేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు, చిన్నారులు


ఊరూరా నీరాజనం.. కామినేనిపల్లె మిట్ట సమీపంలో జగనన్నను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు


పల్లె తరలివచ్చె.. ఎర్రగుంట్ల సమీపంలో ముఖ్యమంత్రిని చూసేందుకు హైవే పైకి చేరుకున్న గ్రామ ప్రజలు


ఉప్పొంగిన ఉత్సాహం.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో..


జన ప్రవాహం.. నంద్యాల సభకు తరలివస్తున్న ప్రజలు

వైఎస్సార్‌సీపీలోకి లాయర్ సాయికృష్ణమూర్తి

- సీఎం వైఎస్ జగన్ సమక్షంలో చేరిక
- కోవెలకుంట్లలో టీడీపీకి షాక్


లాయర్‌బాబుకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీకి 15ఏళ్ల పాటు సర్పంచ్‌గా సేవలందించిన సీనియర్ న్యాయవాది వాసగిరి సాయికృష్ణమూర్తి(లాయర్‌బాబు) గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా ఆళ్లగడ్డలో లాయర్‌బాబు పార్టీ కండువా కప్పుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి చొరవతో బనగానపల్లె, శ్రీశైలం ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పాచక్రపాణిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా, వైఎస్సార్‌సీపీ అవుకు మండల ఇన్‌చార్జి కాటసాని తిరుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బలమైన నేతగా ఉన్న లాయర్‌బాబు వైఎస్సార్‌సీపీలో చేరడంతో కోవెలకుంట్ల పట్టణంలో టీడీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



శిరివెళ్ల: నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్లలో గురువారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. యర్రగుంట్లకు చెందిన వెంకటస్వామి, కావేరి వివాహం జాతీయ రహదారి పక్కనున్న టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఆ క్రమంలో యర్రగుంట్లలో ముఖాముఖి కార్యక్రమం ముగించుకొని నంద్యాల వైపు బస్‌లో వెళ్తున్న సీఎంను చూడడానికి పెళ్లి బృందంతో పాటు నూతన దంపతులు కూడా మండపం నుండి బయటకు వచ్చారు. గమనించిన సీఎం బస్ దిగి వచ్చి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ పరిణామంతో అక్కడకి వచ్చిన ప్రజలు, పెళ్లికి వచ్చిన బంధువులు ఆశ్చర్యపోయారు.

వైభవం.. లక్ష్మీమాధవుడి గజోత్సవం


శ్రీలక్ష్మీమాధవుల గజోత్సవాన్ని నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీమాధవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి అమ్మవార్ల గజోత్సవం, శిబికోత్సవం వాహన సేవను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను గజవాహనంపై ఆశీనులను చేసి మేళతాళాల మధ్య వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గజవాహనానికి ముందు గోరంట్ల వాసులు, వెనుక ఎర్రగుడి వాసులు పోటాపోటీగా స్వామి వారి గజోత్సవాన్ని ఎంతో కోలాహలంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:50
ఆదోని	సా॥ 6:37	ఉ॥ 4:53
నంద్యాల	సా॥ 6:34	ఉ॥ 4:47
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:48
బనగానపల్లె	సా॥ 6:35	ఉ॥ 4:48

హదీస్ వెలుగు :

"ఆకలి దప్పికలు తెలిస్తేనే పేదల కష్టాలు తెలుస్తాయి. రోజాలు పాటించి ఉపవాసాలు ఉంటేనే మనిషి అహం తగ్గి ఆధ్యాత్మికం వైపు నడుస్తారు.'' – పవిత్ర ఖురాన్

స్వాతి మహోత్సవం.. ప్రహ్లాదవరదుని వైభవం


ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిల నవనారసింహ క్షేత్రాలు భక్త జనసంద్రంగా మారాయి. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని భారీగా తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో చేసిన గోవిందా నామస్మరణతో గురువారం నల్లమల పులకించిపోయింది. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామితో పాటు అమృతవల్లీ అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్చారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య శ్రీ స్వాతి, శ్రీసుదర్శన హోమాలు వైభవంగా నిర్వహించి పూర్ణాహుతితో ఈ కార్యక్రమాన్ని ముగించారు.

ఖనిజం తరలిస్తున్న లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్) : వెల్దుర్తి మండలం సర్పరాజాపురం వద్ద ఇనుప ఖనిజం తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. బుధవారం తనిఖీలు చేస్తుండగా రాయల్టీ పత్రంలో చిన్నచిన్న అవకతవకలు, పొరపాట్లు ఉండటంతో లారీని సీజ్ చేశారు. రూ.25 వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌బీ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఎల్‌ఎల్‌బీ రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కర్నూలు ఉస్మానియా బీఈడీ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో జరిగిన మూడు సంవత్సరాల కోర్సు 6వ సెమిస్టర్, ఐదు సంవత్సరాల కోర్సు 10వ సెమిస్టర్ పరీక్షలకు 271 మందికి 262 మంది హాజరు కాగా 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన మూడు సంవత్సరాల కోర్సు రెండవ సెమిస్టర్, ఐదు సంవత్సరాల కోర్సు ఆరవ సెమిస్టర్ పరీక్షలకు 25 మందికి 17 మంది హాజరు కాగా 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణమూర్తి


ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారి

కర్నూలు (లీగల్): బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.కృష్ణమూర్తి తన సమీప ప్రత్యర్థి బి.చంద్రుడిపై 38 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. జిల్లా న్యాయవాదుల సంఘం ప్రాంగణంలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం అయిన పోలింగ్ మధ్యాహ్నం 2 గంటల వరకు సజావుగా జరిగింది. మొత్తం 850 ఓట్లు ఉండగా 689 ఓట్లు పోల్ అయ్యాయి. ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారి సి.ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. చంద్రుడికి 320 ఓట్లు రాగా కృష్ణమూర్తికి 358 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శి స్థానానికి జరిగిన పోటీలో బి.ఎస్.రవికాంత్ ప్రసాద్ తన సమీప ప్రత్యర్థి ఎం.వెంకటేశ్వర్లుపై 271 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. బీఎస్ రవికాంత్ ప్రసాద్‌కు 436 ఓట్లు రాగా ఎం.వెంకటేశ్వర్లుకు 165 ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శిగా డి.విక్రమ్‌సింగ్, కోశాధికారిగా ఎం.మహబూబ్ బాషా, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్.రామనాథ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా బి.సుధీర్ ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గెలుపొందిన కార్యవర్గ సభ్యులకు ఎన్నికల అధికారి సి.ప్రభాకర్‌రెడ్డి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎన్నికల ప్రక్రియలో మద్దెల శ్రీనివాసరెడ్డి, కె.రాజమోహన్‌రెడ్డి, ఎస్‌ఏ ఇందుమతి, బాబుసాహెబ్ పాల్గొన్నారు. ఎన్నికలు సజావుగా జరగటానికి సహకరించిన బార్ అసోసియేషన్ న్యాయవాదులకు ఎన్నికల అధికారి సి.ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- చిత్రాన్నంలో నిద్రమాత్రలు వేసి.. గొంతు బిగించి హత్య
- సహకరించిన ప్రియుడు, కుమారుడు
- కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుల అరెస్టు


నిందితులను అరెస్టు చేసి వివరాలు తెలియజేస్తున్న దేవనకొండ సీఐ శ్రీనివాసులు


మృతుడు కురువ లక్ష్మన్న (ఫైల్)

దేవనకొండ: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తాళి కట్టిన భర్తనే భార్య హత్య చేసింది. అనుమానం రాకుండా భర్త అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో అసలు విషయం వెలుగు చూడటంతో నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. గుండ్లకొండ గ్రామానికి చెందిన కురువ పద్మావతి, కురువ లక్ష్మన్న(44) భార్యాభర్తలు. వీరికి వెంకటేష్ అనే కుమారుడు ఉన్నారు. పత్తికొండ మండలం చక్రాల గ్రామానికి చెందిన బోయ మల్లయ్య అలియాస్ బుడ్డ మల్లయ్య అనే వ్యక్తితో కొంతకాలంగా కురువ పద్మావతి వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త లక్ష్మన్న భార్య పద్మావతితో తరుచూ గొడవ పడుతూ ఉండేవాడు. పద్ధతి మార్చుకోవాలని మందలించేవాడు. దీంతో పద్మావతి ' మీ నాన్న నన్ను కొడుతున్నాడు, వేధిస్తున్నాడు' అంటూ కుమారుడు వెంకటేష్‌కు మాయ మాటలు చెప్పి తన భర్తపై కోపం వచ్చేలా చేసింది. పథకం ప్రకారం ప్రియుడు బోయ మల్లయ్య, కురువ పద్మావతి, కుమారుడు వెంకటేష్‌తో కలిసి ఫిబ్రవరి 17వ తేదీన నిద్రమాత్రల పొడిని చిత్రన్నంలో కలిపి కురువ లక్ష్మన్నకు పెట్టారు. ఇది తిన్న ఆయన గాఢ నిద్రలోకి జారుకోగా.. అదే రోజు రాత్రి 11 గంట సమయంలో ముగ్గురు కలిసి గొంతుకు తాడుతో బిగించి హత్య చేశారు. ఈ కేసు నుంచి తప్పించుకోవాలని మృతదేహాన్ని కారులో తీసుకొని వెళ్లి అనంతపురం జిల్లా పామిడి మండలంలోని ఎన్‌హెచ్-44లో ఉన్న పెన్నానది ఒడ్డు వద్దనున్న చెట్ల పొదలలో పడేశారు. కురువ లక్ష్మన్న కనపడడం లేదని ఈనెల 15న దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో భార్య కురువ పద్మావతి, కుమారుడు కురువ వెంకటేష్ తప్పుడు ఫిర్యాదు ఇచ్చాడు. కేసు నమోదు చేసుకున్న దేవనకొండ సీఐ కె.శ్రీనివాసులు, పోలీసులు విచారణ చేపట్టారు. పత్తికొండ ఎస్డీపీఓ పి.శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో కేసు పూర్వాపరాలను ఛేధించారు. పథకం ప్రకారమే కురువ లక్ష్మన్నను హత్య చేశారని కురువ పద్మావతి, కురువ వెంకటేష్, బోయ మల్లయ్యలు ఒప్పుకున్నారు. దీంతో వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గురువారం కురువ లక్ష్మన్న అస్థి పంజరాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. కేసును ఛేదించినందుకు జిల్లా ఉన్నతాధికారులు దేవనకొండ సీఐ శ్రీనివాసులను, పోలీసు సిబ్బందిని ప్రశంసించారు.

గుడ్‌ఫ్రైడే

క్రీస్తు విధేయతా బలియాగం



క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం ఉంది. దీన్నే సువార్త అంటారు. సువార్త దేవుని సంకల్పంతో ఎప్పుడూ ముడిపడే ఉంటుంది. పూర్వపు దేవుని సంకల్పం చెప్పక దాన్ని దాటవేసే సువార్త అసలు లెస్సయైన లేఖనానుసార సువార్తగా ఎప్పటికీ కానేరదు. సువార్త పుట్టుకకు ఆయువుపట్టు వంటి దేవుని ప్రణాళికను చాలా పకడ్బందీగా, పటిష్టంగా వివరించకున్ననూ అది సువార్త కాదు. సత్యవాక్యం అనే రక్షణ భాగ్యపు సువార్త ప్రకటన అపొస్తలుల బోధకు లోబడే ఉండి తీరాలి.

ఈ జగత్తుకు పునాది వేయక పూర్వమే దేవుని ఆలోచనలలో ఉన్న క్రీస్తు బలియాగం అనే 'పథక రచన' గూర్చి ఎంతగా చెప్పుకొన్నా, అది తక్కువే. తన ప్రజల పాప పరిహారార్థం అద్వితీయ జ్ఞానసంపన్నుడైన దేవుడు అనాదిలోనే క్రీస్తు పరిశుద్ధ రక్తానికి రూపకల్పన చేయడం జరిగింది. అప్పటికి ఇంకా మానవ సృష్టి జరగలేదు. భూలోకమే లేదు. భూమి మీద మనుష్యుల జాడే లేదు. పాపమే లేదు. దీన్నే క్రీస్తు కేంద్రంగా చేయబడిన దేవుని నిత్య సంకల్పంగా చెబుతారు. క్రీస్తు లేకుంటే దేవునికి సంకల్పమే లేదు అనేంత ఉన్నతం గా దీన్ని గూర్చి చెప్పుకోవడం మాత్రం అసాధారణం. తండ్రియైన యెహోవా దేవుడు తన నీతిని బట్టి సంతోషం గలవాడై ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమం సంబంధిత సంకల్పాన్ని మించిన భావజాలం లేదా భావ సంపద మరొకటి లేదంటారు.

దేవుని దృష్టి కోణంలో దేవుని మనస్సుతో దేవుని గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేసే వారికి ఒక విషయం తేటగా అర్థం అవుతుంది. అదేమిటంటే, దేవుడు అన్యాయం చేయుట అసంభవం అనునదే. ఈ సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకొన్నవారే ఆత్మ సంబంధులు. బలిని కాక కనికరమునే కోరే దేవుడు ప్రారంభంలో జంతుబలులను ఏర్పాటు చేసినా కూడా యుక్త కాలాన తన సొంత కుమారుడను బలిగా అర్పించుట ద్వారా ఇలా పాపవ్యాప్తి నివారణకు మేలైన శాశ్వత పరిష్కారం కనుగొని జంతు బలులకు చరమగీతం పలికాడు. యూదులకు చాలా సహజంగా సామాన్యంగా చెప్పే సత్యం ఒక టుంది. రక్తం చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. ఇది నమ్మే యూదులు మెస్సీయ బలిని కనులారా చూడటం ద్వారా విస్మయానికి గురయ్యారు. మహాదేవుని సంకల్పానికి బహు ముగ్ధులై ఐశ్వర్య భయంతో వినయ సంపన్నులైన వారంతా తలలు వంచి దేవుని పాదాల చెంత సాగిలపడ్డారు. మానవాళి అంతా పుట్టారు కాబట్టి చనిపోతారు. యేసుక్రీస్తు మరణించడానికే పుట్టాడంటూ పండిత పెద్దలు పదే పదే చెబుతుంటారు. ఇదే ఆయన జీవితం ప్రత్యేకత. ఇలాంటి జీవితం ఈ భూమి మీద ఏ ఒక్కరికీ లేదన్నదే సుసమాచారం. క్రీస్తు ఈ లోకానికి చెప్ప శక్యం కాని ఒక వరంగాను ఆయన సాహసోపేత విధేయత తాలూకు ప్రాణత్యాగం మానవాళి పాలిట శుభవార్తగానూ చరిత్రకెక్కిందనేది గమనార్హం. బాల్యం నుండే కాక, మూడున్నర సంవత్సరాల తన యౌవన కాలమంతా దేవునికి వెచ్చించి విధేయుడైన వాడై తన్ను తాను దేవునికి అర్పణగా సమర్పించుకున్నాడు. 'నీ చిత్తమే సిద్ధించును గాక!' అంటూ మరణానికి ఎదురుగా వెళ్ళిన అరుదైన జీవితం క్రీస్తు ప్రభువుది.

లోక పాపాలను మోసు కొనిపోయే దేవుని గొఱ్ఱె పిల్లగా, పస్కా బలి పశువుగా క్రీస్తును అభివర్ణిస్తుంది పరిశుద్ధ బైబిలు. దేవునికి అవిధేయులైన మానవాళి పాపాలు గొఱ్ఱె పిల్లపై మోపబడ్డాయి. ఫలితంగా గొఱ్ఱెపిల్ల మరణించింది. క్రీస్తుకు ఇందుకొరకే శరీరం ఇవ్వబడింది లేదా అమర్చబడింది. దేవుని ప్రజల పాపాలకు ప్రతిగా వారి పక్షాన సిలువలో క్రీస్తు శరీరాన్ని శిక్షకు గురి చేయడం ద్వారా దేవుని ప్రజలు తమ తమ పాపాల నుండి విమోచించబడి పరిశుద్ధులయ్యారు. క్రీస్తు మరణం వెనుక దాగిన సువిశేష పరమార్థం ఇదే. మానవ ప్రారంభ ఆదాము అనే ఒకని అవిధేయత ద్వారా లోకంలోనికి పాపం ప్రవేశించింది. కడపటి ఆదాము అనే ఒకని విధేయత ద్వారా యావత్తూ అవిధేయ మానవాళికి రక్షణ భాగ్యం సంప్రాప్తించింది. వారంతా కొత్త జన్మతో నూతన సృష్టిగా పరివర్తన చెందారు. ఆ కడపటి ఆదామనే క్రీస్తు సాహసోపేత జీవిత విధానమే ఎల్లరకు పరిశుద్ధ జీవితాలను అనుగ్రహించింది.

ఈ దిగువ గల యెషయా భవిష్యత్ ప్రవచనం దాని వర్ణన అత్యున్నతమైన క్రీస్తు విధేయత జీవిత సారాన్ని అసాధారణ రీతిలో వెల్లడి చేయుట అనేది మనస్సు పెట్టి గమనించదగ్గది. బలియాగంలో క్రీస్తు చూపిన విధేయత ఇప్పటికీ వేనోళ్ళ కొనియాడబడుతునే ఉండుట బహు ఆశ్చర్యకరం! ఈ ప్రవచనం క్రీస్తు నందు నెరవేరింది.


''అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరువలేదు
వధకు తేబడు గొఱ్ఱె పిల్లయు
బొచ్చు కత్తిరించు వాని యెదుట గొఱ్ఱెయు
మౌనముగా నుండునట్లు
అతడు నోరు తెరువ లేదు
అన్యాయపు తీర్పు నొందిన వాడై
అతడు కొనిపోబడెను
అతడు నా జనుల యతిక్రమమును బట్టి
మొత్తబడెను గదా''

ఈ అరుదైన సృష్టిలో, బిడ్డను నవ మాసాలు మోసిన కన్న తల్లి అతన్ని భూమి మీద విడిచి పెట్టి కన్ను మూసింది. అతడు పెద్దవాడై తన తల్లి పట్ల నిత్యమూ కృతజ్ఞతాభావం కలిగిన వాడై ఆమె ఆలోచనలు, ఆశయాలు అన్వేషిస్తూ వాటి సాధనలో నిత్యమూ నిమగ్నమవడమే కాకుండా, తన తల్లి వలె ఏ ఒక్కరూ రక్త హీనతతో చనిపోకుండా పుష్టినిస్తూ బలవృద్ధి కలుగజేసే బహు మేలైన ఉచిత సేంద్రీయ సహజాహార పంపిణీకి దృఢ సంకల్పంతో నడుం కట్టాడు. తన తల్లి మరణాన్ని ఒక పండుగగా, వేడుకగా మలిచే పనిలో సత్క్రియల యందాసక్తితో అతడు సమాజంతో ప్రేమలో పడ్డాడు. 'ఆమె మరణించి మనకు దూరం కాలేదు. ఇదిగో ఇక్కడే ఉంది నవ్వుతూ అన్న భావనను కుటుంబంలోను, బంధు మిత్రులలోనూ ఆమె కొడుకు కలుగజేసిన వైనం అతనిదైన సృజనాత్మక కళాత్మక పనితనమనే చెప్పాలి. అది చూసి ఊరు ఊరంతా ఆ మహాతల్లి త్యాగం వూరికే పోతుందా అనే వారే అంతటా. తన మాతృమూర్తి ప్రేమను అతడు సెలబ్రేట్ చేయబూనే వైవిధ్య విధానానికి తెరలేపడం వలన అంతా మంత్రముగ్ధులయ్యేలా అది ఊరంతా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమ్మ అజెండా సాధనే ధ్యేయంగా పిల్లవాడి ప్రయాసకు అంతా జత కలిశారు.

యేసు ప్రాణ త్యాగం అచ్చు ఇలాంటిదే. సెలబ్రేట్! జీసస్ సెలబ్రేట్!

– జేతమ్

వారపు ప్రప్రథమ దినం అనే ప్రతి ఆదివారం నాడు యెడతెగక దేవుని ఆరాధనలో భాగంగా జరిగే రొట్టె విరుచుట అనేది క్రీస్తు బలియాగానికి గుర్తు. క్రీస్తు పస్కా బలి పశువుగా, వధకు సిద్ధమైన గొఱ్ఱెపిల్లగా అనాదిలోనే దేవుని చేత నిర్ణయించబడినవాడు. అది క్రీస్తు మరణంతో నెరవేరుటను నేడు మనం చూస్తున్నాం. క్రీస్తు వారి నలగగొట్టబడిన శరీరానికి గుర్తుగా రొట్టెను, మానవాళి కొరకు చిందించబడిన పవిత్ర రక్తానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని... ఇలా రెండింటిని కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలతో తీసుకుంటూ ప్రభువు వచ్చువరకు ఇలా చేస్తూ క్రీస్తు సిలువ యాగాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది క్రీస్తు ప్రభువు వారి సంఘం. నిజానికి ఇది భోజనం, పానం కాదు. నీతి, సమాధానం, పరిశుద్ధాత్మ సంబంధిత ఆత్మానందం ఇహమందు కాక ఈ లోక సంబంధులుగా కాక పరలోక సంబంధులుగా సంఘమనే దేవుని రాజ్యంలో జరుపుకొనే పండుగ. సంఘ భవనంలోనే ఇది జరిగినా కూడ సత్య లేఖనాల సారం ప్రకారంగా ఇది ఇహమందు అద్వితీయ సత్యదేవుడు, ఆయన నియమించిన రాజు ప్రధాన యాజకుడైన క్రీస్తు వారి సమక్షంలో జరిగే అత్యున్నత సంఘ కార్యక్రమం. సంఘం అంటే పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని అర్థం. ఇట్టి ఆదివారపు దేవుని ఆరాధనతో సంఘం పరిశుద్ధంగా, ఆత్మ సంబంధంగా అన్నింటా బలపడుతూ ఉంటుంది.




ఒకనాడు దేవుడు ఆజ్ఞాపించి చేయమన్న ఇహలోక భూ భౌతిక సంబంధ పండుగల కంటె మిన్నగా ఆత్మ సంబంధ పండుగను ఒకటి నిర్ణయించి నేడు ఉన్నతంగా ఆచరించమని తన గ్రంథం ద్వారా ఆజ్ఞాపిస్తున్నాడు. అదే క్రీస్తు పస్కా పండుగ. ఇది హృదయానందానికి సంబంధించినది. ఇది ఎక్కడా ప్రసిద్ధి చెందినట్టుగా బహు ప్రాచుర్యంలో ఉన్నట్టుగా లోకంలో కనబడదు. క్రీస్తు పస్కా పండుగ ఒకటి ఉందనేది లోకానికి తెలియదు. ఎందుకంటే ఇది ఆత్మసంబంధమైనది. దేవుని రాజ్యం దానిని పొందిన వారి అంతరంగానికి మాత్రమే అందే కార్యం. ఇది తన తోటి వారికి, పక్కవారికి, అన్యులకు ఏనాడూ అంతు చిక్కని కార్యం. ఇది జీవం గల దేవుని సంఘంలో క్రీస్తును బట్టి క్రీస్తు ద్వారా క్రీస్తునందు జరిగే ఉన్నతమైన కార్యక్రమం.

● ముత్తు నందిని ప్యాలెస్

ఇష్టాల ఇల్లు

రాజ్ చందర్ పద్మనాభన్, నాగ జయలక్ష్మి దంపతులు తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారిలో నివసించేవారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమంలో వీరు అనుసరించిన విధానం ఇప్పుడు దేశమంతటినీ ఆకర్షిస్తోంది. పర్యావరణ ప్రేమికులనైతే మరీ ఎక్కువగా ఆకట్టుకుంటోంది. రెండేళ్ల కిందట గృహప్రవేశం చేసుకున్న కొత్త ఇల్లది. అయితే ఆ ఇంట్లో అడుగుపెడితే కాలం గిర్రున సినిమా రీల్‌లాగ వందేళ్ల వెనక్కి తిరిగిపోయిందా అనిపిస్తుంది. ఇంటిని చూడడానికి వచ్చిన వాళ్లను అతిథి మర్యాదలతో ముంచెత్తుతారు ఈ దంపతులు. సేంద్రియ పద్ధతిలో పండించిన దినుసులు, కాయగూరలతో సంప్రదాయ తమిళ, చెట్టినాడు వంటలను వడ్డిస్తారు.





నాగ జయలక్ష్మి, రాజ్ చందర్ పద్మనాభన్

పర్యావరణహిత భవనం ముత్తు నందిని ప్యాలెస్





ఎర్రమట్టి, సున్నపు రాయితో నిర్మించిన ఇంట్లో భూగర్భ జలాలను పరిరక్షించే ఏర్పాటు ఉంది. బంకమట్టి నిర్మాణం కావడంతో ఎండాకాలం చల్లగా ఉంటుంది. నేచర్ ఫ్రెండ్లీ ట్రావెల్‌ను ఇష్టపడే వాళ్లు ఇక్కడ బస చేస్తుంటారు. బస చేయకపోయినా చూసిపోవడానికి వచ్చేవాళ్లు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ కాలంలో ఇంటిని ఇలా ఎందుకు కట్టుకున్నారనే ప్రశ్న దాదాపుగా ప్రతి ఒక్కరి నుంచి ఎదురవుతుంటుంది. జయలక్ష్మి ప్రతి ఒక్కరికీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటుంది.

బాల్యంలోకి వెళ్లారాయన!

''రాజ్‌చందర్ వృత్తిరీత్యా జియో డాటా అనలిస్ట్. ఆయనకు ఇష్టమైన రోజులంటే చిన్నప్పుడు వాళ్ల అమ్మమ్మ గారింట్లో గడిపిన బాల్యమే. పైగా రాజ్ అభిరుచి, విధి నిర్వహణ కూడా పర్యావరణవేత్తలతో కలిసి పని చేయడమే. ఈ రెండు ఇష్టాలను కలుపుతూ చక్కటి ఇల్లు కట్టుకోవాలని ఎప్పుడూ చెప్పేవారు. నాక్కూడా మా సంప్రదాయ నిర్మాణంలో ఉండే సౌందర్యం చాలా ఇష్టం. ఇద్దరి అభిరుచులూ కలవడంతో ఇంటిని ఇలా కట్టుకున్నాం. మా ఇద్దరి ఇష్టాల మేరకు ఎలా కట్టుకోవాలో ఒక ఐడియా వచ్చేసింది. ఎక్కడ కట్టాలనే విషయంలో ఒక అభిప్రాయానికి రావడం కొంచెం కష్టమే అయింది. లొకేషన్ సెర్చింగ్ మొదలు పెట్టాం.

సంజీవని శకలం

కన్యాకుమారికి సమీపంలో పోథయాడి గ్రామాన్ని చూసినప్పుడు కొండలు, పచ్చటి చెట్లతో ప్రదేశం బాగుందనిపించింది. ఆశ్చర్యంగా మరో విషయం తెలిసింది. అదేంటంటే... రామాయణంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు వైద్యం కోసం హనుమంతుడు ఏకంగా సంజీవని మొక్క ఉన్న పర్వతం అంతటినీ ఎత్తుకొచ్చాడని విన్నాం. వైద్యం చేసిన తర్వాత ఆ పర్వతాన్ని తిరిగి తీసుకెళ్లే క్రమంలో పర్వతంలోని ఒక శకలం విరిగి కింద పడి పోయిందని, ఆ శకలమే ఈ కొండ అని చెప్పారు స్థానికులు. వాళ్ల విశ్వాసాన్ని పక్కన పెడితే ఆ కొండమీద చుట్టు పక్కల ఉన్న మొక్కలన్నీ ఔషధ మొక్కలే. ప్రకృతితో మమేకమై నివసించడానికి మాకు ఇంతకంటే సౌకర్యవంతమైన ప్రదేశం మరోటి ఉండదేమో అనిపించింది. అంతే... 2021లో నిర్మాణం మొదలు పెట్టాం. ఒక ఏడాదిలో తమిళ, వేనాడు, చెట్టినాడు సంస్కృతుల సమ్మేళనమైన మా ఇంటి నిర్మాణం పూర్తయింది. సంప్రదాయ కళాకృతుల సేకరణ నా హాబీ. ఇంటిని తమిళ సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా మలిచాను. ఇంటి ముఖద్వారం నుంచి నేల, గోడ, మెట్లు, పై కప్పు, అలంకరణ వస్తువులు ప్రతి ఒక్కటీ తమ వైభవాన్ని తామే చెప్పుకుంటాయి. పర్యావరణ హితమైన సున్నపు పొడి ఇటుకలు, ఎర్ర మట్టి, ఆవుపేడ, ధాన్యం పొట్టు, కోడిగుడ్లు, బెల్లంతోపాటు అత్తంగుడి నది తీరాన దొరికే ఇసుకతో తయారు చేసే అత్తంగుడి టైల్స్‌ను వాడాం. పై కప్పుకి కాంక్రీట్ వాడకాన్ని తగ్గించి ఫిల్లర్ స్లాబ్ టెక్నిక్ ఉపయోగించాం. వర్షపు నీటిని నిల్వ చేయడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్, కరెంటుకోసం సోలార్ ప్యానెల్స్ పెట్టాం. ఈ మట్టి సౌధంలో 5 బెడ్ రూమ్‌లు, మూడు బాల్కనీలు, మూడు లివింగ్ స్పేస్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు రెండు వందల మందికి పైగా పర్యాటకులు ఈ హోమ్ స్టేలో బస చేశారు. ఆహారం కూడా తమిళనాట ప్రాంతాల వారీగా విలసిల్లిన విభిన్నమైన రుచులుంటాయి. ఇంటి ఆవరణలో అన్ని రకాల కూరగాయలనూ పండిస్తాం. వంటగదిలో వచ్చే వ్యర్థాలనే ఎరువుగా వేస్తాం'' అని తమ పర్యావరణ హిత భవనం ముత్తు నందిని ప్యాలెస్ గురించి వివరించింది జయలక్ష్మి.

పరివర్తన

ఇప్పుడవి రాళ్లు విసిరే చేతులు కాదు

ఆ అమ్మాయి ఒకప్పుడు గుంపులో రాళ్లు విసిరే కశ్మీరీ అమ్మాయి. ఇప్పుడు జమ్ము-కశ్మీర్‌లో కేవలం బాలికల కోసం ఫుట్‌బాల్ అకాడెమీ నడుపుతున్న ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్. ఆమెలో వచ్చిన మార్పు ఆమెను ప్రధాని నరేంద్ర మోదీ చేత కూడా మాట్లాడించేలా చేసింది. విరాట్ కోహ్లీ కూడా ఆమెను మెచ్చుకున్నాడు. యువతకు సరైన దిశ ఉంటే వారు గెలిచి తీరుతారనడానికి అఫ్షాన్ ఆషిక్ ఒక ఉదాహరణ.

కొన్నేళ్లు వెనక్కు వెళితే 2017 డిసెంబర్‌లో ఒక ఫోటో వైరల్ అయ్యింది. ఒకమ్మాయి... ముఖానికి దుపట్టా కట్టుకుని జమ్ము కశ్మీర్ పోలీసులపైకి రాళ్లు విసురుతున్న ఫొటో అది. ఆ అమ్మాయి పేరు అఫ్షాన్ ఆషిక్. ముఖం కనబడకుండా గుడ్డ కట్టుకోవడంతో తనను ఎవరూ గుర్తుపట్టరని అఫ్షాన్ భావించింది. కానీ తర్వాత ఆమె గురించి అందరికీ తెలిసిపోయింది. సమాజం ఆమెపై 'స్టోన్ పెల్టర్' ముద్ర వేసింది. అప్పటికే ఆ అమ్మాయి ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ కనపరుస్తూ ఉంది. కాని ఈ ఫోటోతో ఆమె తన ఆటకే దూరమయ్యే స్థితి వచ్చింది.

'ఆ రోజు నేను పోలీసుల మీద రాళ్లు రువ్వాను. అది కోపంలో చేసిన పని. దానికి కారణం పోలీసులు అకారణంగా మమ్మల్ని వేధించారు. విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మమ్మల్ని మేము కాపాడుకోవడానికి రాళ్లు విసరడం మినహా మాకు గత్యంతరం లేదు. నేనేమి ప్రొఫెషనల్ స్టోన్ పెల్టర్‌ను కాదు. కాని నా మీద ముద్ర పడింది. దాని నుంచి బయటపడాలంటే నేను నా చదువు మీద నా ఫుట్‌బాల్ ఆట మీద దృష్టి పెట్టి విజయం సాధించాలని అనుకున్నాను' అంది అఫ్షాన్ ఆషిక్.

ఈ ఘటన తర్వాత ఆ అమ్మాయి నెల రోజులు ఇంటికే పరిమితమైంది. అఫ్షాన్ తండ్రి ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లనీయలేదు. అరగంటపాటు ఆడుకుని వచ్చేస్తానని తల్లికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఒకరోజు చాలా ఏడుస్తుంటే నన్ను చూసిన నాన్న ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. ఇంట్లో కూర్చుని ఏం చేయాలని ప్రశ్నించాను. ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించడంతో మళ్లీ ఆట మొదలుపెట్టాను' అందామె.

ముంబై వెళ్లి

కశ్మీర్ యువత తమ చదువు, క్రీడల పట్ల దృష్టి పెట్టాలని భావించిన ప్రభుత్వం అఫ్షాన్‌ను తగిన ప్రోత్సాహం అందించింది. జమ్మూ కశ్మీర్ క్రీడాశాఖ చేయూతతో అఫ్షాన్ ముంబై వెళ్లి ఆటలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత జమ్ము కశ్మీర్ నుంచి తొలి ప్రొఫెషనల్ ఫిమేల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయ్యింది. 'నువ్వు ఆడపిల్లవి. ఫుట్‌బాల్ నేర్చుకుని ఏం చేస్తావ్ అని అందరూ అడిగేవారు. నేను ఆడే సమయానికి ఆడపిల్లలు ఎవరూ మా ప్రాంతం నుంచి ఫుట్‌బాల్‌లోకి రాలేదు. కాని నేను ఆగలేదు. పట్టుదలగా ముందు కెళ్లాను. ఇండియన్ విమెన్స్ లీగ్‌లో ఆడాను. గోల్ కీపర్‌గా విశేష ప్రతిభ కనపరిచాను. ఆ సమయంలో విదేశీ మహిళా ఫుట్‌బాల్ ప్లేయర్లని గమనించాను. వాళ్లకు చాలా మంచిశిక్షణ ఆ దేశాల్లో లభిస్తోంది. మా ప్రాంతం బాలికలకు కూడా లభించాలని భావించాను. అందుకే జమ్ము కశ్మీర్ బాలికల కోసం యునీక్ ఫుట్‌బాల్ అకాడెమీ స్థాపించాను' అని తెలిపింది అఫ్షాన్.



అఫ్షాన్ ఆషిక్



ఆరోజుల్లో రాళ్లు విసురుతున్న అఫ్షాన్ ఆషిక్

మరింత గుర్తింపు

నేడు జమ్ము కశ్మీర్‌లో మహిళా ఫుట్‌బాల్ పేరు చెప్తే అఫ్షాన్ పేరే అందరికీ గుర్తుకొస్తుంది. ఆమెకు అక్కడ ఒక సెలబ్రిటీ హోదా ఉంది. 'నేను నా గతాన్ని జయించాను. ఇప్పుడు నేను స్టోన్ పెల్టర్‌ని కాను. గోల్ కీపర్‌ని. ఇకపై నన్ను జనం అలాగే గుర్తు పెట్టుకుంటారు' అంటుందామె.